


### నేత్రపర్వం.. బాలాజీ పరిణయం
పవిత్ర వైనతేయ గోదావరి నదీతీరం అప్పనపల్లి క్షేత్రంలో బాలునిగా కొలువుదీరిన బాలబాలాజీ స్వామి దివ్య తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది.

10లో



### హోరాహోరీగా ఎడ్ల పందేలు
మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ జాతరలో భాగంగా శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పందేలు హోరాహోరీగా సాగాయి.

### 10,978 క్యూసెక్కుల మిగులు జలాలు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 10,978 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.75 అడుగుల నీటిమట్టం నెలకొంది.

## న్యూస్‌రీల్

### వనదుర్గమ్మకు ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చండీ హోమం ప్రారంభించారు. హోమం అనంతరం 11 గంటలకు హోమగుండంలో ద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత అమ్మవార్లకు పండితులు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు, నైవేద్యం సమర్పించారు. వనదుర్గ అమ్మవారికి నిర్వహించిన హోమంలో 40 మంది భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో, కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

### డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రామస్వామి బాధ్యతలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా తుమ్మల రామస్వామి (బాబు) శుక్రవారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా డీసీసీబీ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించారు. బ్యాంకు సీఈఓ ఆర్వీ నరసింహారావు తుమ్మల బాబుతో సంతకాలు చేయించారు.

### డీఎస్సీ పరీక్షలు ప్రారంభం
– తొలిరోజు 893 మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉపాధ్యాయ నియామక పరీక్షకు సంబంధించి నిర్వహిస్తున్న డీఎస్సీ–25 ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 6 ఆన్‌లైన్ కేంద్రాల్లో ఉదయం ఐదు, మధ్యాహ్నం ఒక కేంద్రంలో పరీక్ష నిర్వహించారు. రెండు సెషన్‌లకు సంబంధించి 1,024 మంది హాజరుకావలసి ఉండగా 893 మంది పరీక్షలు రాయగా 131మంది గైర్హాజరయ్యారని డీఈఓ పిల్లి రమేష్ తెలిపారు.

### 9న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కోసం ప్రభుత్వం షైనింగ్‌స్టార్స్ కార్యక్రమం చేపడుతోంది. ఈ నెల 9న కుళాయిచెరువు ఆవరణలో గల ఫ్యాబ్రిక్ కన్వెన్షన్ హాల్లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 132 మంది పదోతరగతి, 36 మంది ఇంటర్ విద్యార్థులు కలిపి 168 మందిని ఎంపిక చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.20వేల చొప్పున నగదు పురస్కారం అందించనున్నారు. ఇప్పటికే ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మండల స్థాయిలో 500 మార్కులు పైబడి వచ్చిన వారిని ఆరుగురిని ఎంపిక చేశారు. వీరిలో ఓసీ 2, బీసీ 2, ఎస్సీ1, ఎస్టీ1 ఎంపిక చేశారు. ఇంటర్మీడియెట్‌లో 830 మార్కులు పైబడి వచ్చిన వారిని ఎంపిక చేశారు.

### రేపటి నుంచి జిల్లా స్థాయి యోగా పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 11 వరకు జిల్లా క్రీడామైదానంలోని యోగాహాల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం తెలిపారు. యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 60 సంవ్సరాల పైబడిన వారు సీనియర్స్ విభాగంలో, 9వ తేదీన జూనియర్స్ 10 నుంచి 18 సంవత్సరాల విభాగంలో, 10న యూత్ 19 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల విభాగంలో, 11న సీనియర్స్ విభాగంలో 36 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు వారికి, 11న సీనియర్ సిటిజన్ విభాగంలో 60 సంవత్సరాల పైబడిన వారికి ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు ఆయా తేదీలలో యోగా సూట్ ధరించి పోటీలకు ఉదయం 8 గంటలలోపు హాజరుకావాలని శ్రీనివాస్ కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు మండలస్థాయిలో మొదటి రెండు స్థానాలు సాధించిన వారు అర్హులన్నారు. వివరాలకు 89196 42248 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



# యంత్ర రాయితీకి చంద్రగ్రహణం



- కూలీ రేట్లు పెరగడంతో యంత్రాలపైనే ఆధారపడ్డ **రైతులు**
- గత ఏడాది ఒక్క పరికరమూ అందించని కూటమి **ప్రభుత్వం**
- ఎక్కువ రేట్లు చెల్లించి పరి**కరాలు** అద్దెకు తెచ్చుకొంటున్న అన్నదాతలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రైతులు సాంకేతికత సహాయంతో పంటలు పండించాలని చెబుతూనే యంత్ర రాయితీ పథకానికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సర్కారు మంగళం పాడింది. ఏటా రైతులకు 50 శాతం రాయితీపై యంత్రసేవా పథకంలో వ్యవసాయానికి సంబంధించిన యంత్ర పరికరాలు ఇవ్వాల్సి ఉంది. ఈ యంత్ర సేవా పథకానికి కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేస్తుంది. రైతులకు విత్తు దగ్గర నుంచి వరి కోతల వరకూ వివిధ దశల్లో ఉపయోగపడే యంత్ర పరికరాలు ఈ యంత్ర సేవా పథకం ద్వారా అందజేయాల్సి ఉంది. దుక్కులు, దమ్ములు చేసుకొనేందుకు ట్రాక్టర్లు, డ్రమ్ ఫీడర్స్, రైతులు కోతలుకు వినియోగించే వరికోత యంత్రాలతోపాటు పలు పరికరాలు ఈ పథకంలో ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క రైతుకూ రాయితీ పరికరాలు ఇచ్చిన పాపాన పోలేదు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులకు కనీసం టార్పాలిన్‌లు, స్ప్రేయర్లు కూడా పంపిణీ చేయకపోవడంతో అద్దెలకు తెచ్చుకొని పనులు చేసుకున్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 2 లక్షలకు పైగా రైతులు ఉన్నారు. జిల్లాలో 2.18 లక్షల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా రైతులకు, రైతు సంఘాలకు యంత్రసేవా పథకంలో రాయితీపై పరికరాలు అందించేవారు.

**రెండు సీజన్లలో తప్పని అవస్థలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచింది. ఖరీఫ్, రబీ సీజన్‌లు కూడా ముగిశాయి. కానీ రైతులకు కనీసం ఒక్క టార్పాలిన్, స్ప్రేయర్లు, వరికోత యంత్రాలు, మినీ ట్రాక్టర్లు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు వంటివి ఏమీ మంజూరు చేయలేదు. యంత్ర సేవా పథకంలో కేంద్ర ప్రభుత్వం నిధులు సైతం ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. ఆ నిధులు ఏమీ చేశారో సీఎం చంద్రబాబునాయుడికే తెలియాలి. కేంద్ర ప్రభుత్వం **రైతులకు ఇచ్చే పథకాల నిధులు కూడా రైతులకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రతీ గ్రామంలో సుమారు రెండునుంచి మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంటుంది. ఆయా గ్రామాల్లో సీజన్‌లో యంత్ర పరికరాలు లేకపోవడంతో వేరే ప్రాంతాల నుంచి పరికరాలు తీసుకొచ్చి పనులు** చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రైతులకు వరికోత యంత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి. గత ఖరీఫ్, రబీ సీజన్‌లో తగిన యంత్రాలు లేకపోవడంతో ఒడిశా, బిహార్, పంజాబ్ వంటి రాష్ట్రాల నుంచి వరికోత యంత్రాలు అద్దెకు తెచ్చుకోవాల్సి వచ్చింది. గత రబీ సీజన్‌లో కోతలు కోసే సమయంలో వర్షసూచనల నేపథ్యంలో రైతులు యంత్రాలు లేక, కూలీలు లభించక చాలా అవస్థలు పడ్డారు. ఇదే అదనుగా పలువురు దళారులు వరికోత యంత్రాలు వేరే ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అద్దెలు బాగా పెంచారు. ఎకరా పొలం వరికోత కోయడానికి రూ.3,500 చొప్పున వసూలు చేశారు. వరికోత యంత్రాలు స్థానికంగా అందుబాటులో ఉంటే రూ.2,500 తీసుకొనేవారు. వర్షసూచన నేపథ్యంలో ఎక్కువ రేటు పెట్టి అయినా సరే రైతులు కోతలు కోయించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక రైతులు కోతలు పూర్తయిన తర్వాత ధాన్యం ఆరబోసుకొనేందుకు టార్పాలిన్ అవసరం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు కావాల్సిన టార్పాలిన్‌లు 50 శాతం రాయితీపై అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఇవ్వకపోవడంతో అద్దెకు తెచ్చుకోవాల్సి వచ్చింది. వర్షసూచన నేపథ్యంలో ఒక్కొక్క టార్పాలిన్‌కు రూ.50 చొప్పున అద్దె చెల్లించి తెచ్చుకోవాల్సి వచ్చింది. ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉంటే మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో సుమారు 10 రోజుల పాటు రైతులు ధాన్యాన్ని ఎండపెట్టాల్సి వచ్చింది. ఒక ఎకరం పొలంలో ధాన్యం ఎండపోసేందుకు ఐదారు టార్పాలిన్‌లు అవసరం కాగా వాటిని అద్దెకు తెచ్చుకోక తప్పలేదు. ఇలా కొందరు రైతులు 20 రోజుల వరకూ ధాన్యం తరలించకపోవడంతో వాటికి అద్దెలు చెల్లించాల్సి వచ్చింది. అదే ప్రభుత్వం రాయితీపై ఇస్తే ఆ టార్పాలిన్‌లు రైతులకు రెండు, మూడు సంవత్సరాల వరకూ వినియోగించుకొనే అవకాశం ఉంటుంది. అద్దె బాధ తప్పుతుంది. పురుగు మందులు పిచికారీ చేసే స్ప్రేయర్లు కూడా ఈ ప్రభుత్వం ఇవ్వలేని దుస్థితిలో ఉంది. రైతులు గత ఖరీఫ్, రబీ సీజన్‌లో అద్దెకు తెచ్చుకొనే మందులు పిచికారీ చేసుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ మొదలైనా రాయితీ పరికరాల ఊసే ఈ ప్రభుత్వం ఎత్తడం లేదు.

**గ్రామీణ ప్రాంతాల్లో కూలీల కొరత**

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల కొరత భారీగా ఉంది. గ్రామ ఆయకట్టుకు తగిన విధంగా కూలీలు గ్రామాల్లో దొరకడం లేదు. గతంలో వేరే ప్రాంతాల నుంచి కూలీలు వలసలు వచ్చి వరినాట్లు, వరి కోతలు, కలుపుతీత వంటి పనులు చేసేవారు. దీంతో కూలీల కొరత కొంతమేర తగ్గేది. ప్రస్తుతం వలస కూలీలు అసలు రావడం లేదు. దీంతో రైతులకు స్థానిక కూలీలతో పనులు చేయించుకోవడం కష్టసాధ్యమైపోయింది. ఈ నేపథ్యంలో యంత్ర పరికరాలు ఉంటే రైతులకు ఎంతో మేలు చేస్తాయి. ఎకరం వరి కోత కోయాలంటే ప్రస్తుత కూలి రేటు ప్రకారం రూ.6 వేలు చెల్లించాలి. కుప్ప నూర్పిడికి ట్రాక్టరు, కూలీలకు మరో రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వరికోత యంత్రం ద్వారా అయితే రూ.3,500 సరిపోతుంది. ధాన్యం ఆరబోతకు టార్పాలిన్లు, కూలికి మరో రూ.3 వేలు ఖర్చవుతుంది. ఈ విధంగా రైతుకు రూ.6 వేలు మిగులుతుంది.

**వైఎస్సార్ సీపీ హయాంలో..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2,431 రైతులకు, 150 రైతు సేవా సంఘాలకు రూ.27.52 కోట్లు విలువ చేసే యంత్ర సేవా పథకాలు క్రమం తప్పకుండా ఏటా అందజేశారు. గ్రామాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన యంత్ర పరికరాలు తక్కువ రేట్లకు అద్దెకు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ విధానానికి కూడా కూటమి సర్కార్ స్వస్తి పలికింది. దీంతో రైతులు దళారుల వద్ద యంత్ర పరికరాలు తెచ్చుకొని అధికంగా అద్దెలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.



గత రబీ సీజన్‌లో కరప మండలంలో ఒడిశా నుంచి తీసుకువచ్చిన యంత్రంతో వరి కోతలు

### యంత్రసేవా పథకం పునరుద్ధరించాలి



ఖరీఫ్, రబీ సీజన్‌లో ఈ యంత్ర పరికరాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో బయట నుంచి వచ్చే వరి కోత మెషీన్‌లపై ఆధారపడి కోతలు కోయడం వల్ల ఎకరాకు రూ.2 వేల వరకూ అదనంగా చెల్లించాల్సి వచ్చింది. ప్రభుత్వం యంత్రాలు ఇస్తే మాకు భారం తగ్గుతుంది.

– అడబాల గోవిందు, రైతు వీకేరాయపురం, సామర్లకోట మండలం

### టార్పాలిన్లు, స్ప్రేయర్లు ఇవ్వాలి



గత సంవత్సరం స్ప్రేయర్లు, టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. వీటి అద్దెలు రూ.2 వేలు చెల్లించాను. అదే ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తే రెండు, మూడు సంవత్సరాల వరకూ వీటిని వినియోగించుకోవచ్చు. ప్రభుత్వం యంత్రసేవా పథకం పునరుద్ధరించాలి.

– ఎలుగుబంట్ల రవినాయుడు, రైతు కూరాడ, కరప మండలం

### నేడు 6 వేల మందితో యోగా నిర్వహణ

బాలాజీచెరువు: కాకినాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి టైటాన్ షోరూం వరకూ కిలోమీటర మేర ప్రధాన రహదారిలో శనివారం యోగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సాగిలి షణ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా ఉదయం 6.30 నుంచి 9గంటల వరకూ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలియజేశారు. సూర్యాకళామందిరం, అంబేద్కర్‌భవన్‌లో 600 మందితో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

### గోగులమ్మకు వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటంతో గోగులమ్మ వారు

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున కొలువైవున్న గోగులమ్మకు వెండి కిరీటాన్ని భక్తులు శుక్రవారం సమర్పించారు. రాజానగరంతోపాటు పలుప్రాంతాలకు చెందిన భక్తులంతా కలసి సుమారు రూ.4 లక్షలు విలువ చేసే 4 కిలోల బరువు ఉన్న ఈ కిరీటాన్ని శనివారం జరిగే తిరునాళ్లను పురస్కరించుకుని అమ్మవారికి కానుకగా సమర్పించారు. శని, ఆదివారాలలో ఇక్కడ గోగులమ్మ వారి జాతర, తిరునాళ్లు, వీరభద్ర స్వామి సంబరాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### పదవుల కోసం తండ్రిపై ఆరోపణలు సరికాదు

- బార్లపూడి క్రాంతిపై మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి ఫైర్
- పవన్ కళ్యాణ్ అపాయింట్‌మెంట్ కోసం ఇంత దిగజారి పోవాలా?



మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పదవుల కోసం నీ తండ్రి మీద, నీ తమ్ముడుపై ఆరోపణలు చేయడం సరికాదని కాపు ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతికి మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి సూచించారు. బార్లపూడి క్రాంతి ఇటీవల తండ్రి ముద్రగడపై, సోదరుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుపై చేసిన వ్యాఖ్యలకు లక్ష్మీ శివకుమారి ఘాటుగా స్పందించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అపాయింట్‌మెంట్ కోసం నీవు దిగజారి పోవాలా? అని ప్రశ్నించారు. నీ రాజకీయం కోసం మా నాయకుడు గిరిబాబుపై నిందలు వేస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. తన తండ్రి ఆరోగ్యం కోసం కొడుకు గిరిబాబు పడుతున్న కష్టాలు రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గ ప్రజలకు తెలుసునని అన్నారు. ఎన్నికలప్పుడు నీ తండ్రి మీద ఆరోపణలు చేసి పరువు తీసినప్పుడు ఈ ప్రేమ ఏమైందన్నారు. మా నాయకుడు ముద్రగడ ఆరోగ్యం నిలకడగానే ఉంది. నీ తండ్రి ముద్రగడ పద్మనాభం 'నా కూతురితో ఇంక సంబంధాలు లేవు, నాకు ఏమి జరిగినా చూడటానికి కూడా రావద్ద'ని ఎన్నికల సమయంలో మీడియా ముఖంగా చెప్పింది నీకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. మా నాయకుడు గిరిబాబుపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తే త్వరలోనే మరిన్ని ఆధారాలతో నీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ముద్రగడపై కక్షతోనే పవన్ కల్యాణ్ జనసేన నాయకురాలు క్రాంతితో వ్యాఖ్యలు చేయిస్తున్నారా? అనే అనుమానం ఉందన్నారు. క్రాంతిపై పవన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీ మామయ్య, నీ భర్త ఆరోగ్యం కోసం ట్రీట్ మెంట్ చేయించుకో అని ఆమెకు సూచించారు.

# ముందస్తుకు నీళ్లొదిలారు!

- ఉమ్మడి జిల్లాలో ముందస్తు ఖరీఫ్ సాగు లేనట్టే
- ఒకటో తేదీన మొక్కుబడిగా నీటి విడుదల
- తూర్పు, మధ్య డెల్టాకు కలిపి 300 క్యూసెక్కులు మాత్రమే
- పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కులు
- పలుచోట్ల కాలువలపై పనులు
- మధ్య డెల్టాకు లొల్ల లాకుల వద్దనే నిలిపివేసిన అధికారులు
- ఈ మాత్రం దానికి ఎందుకు వదిలినట్టు అని రైతుల మండిపాటు



మధ్య డెల్టా పరిధిలో ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల దిగువన పంట నీరు రాకుండా కాలువకు అడ్డుగా మట్టి కట్ట



మధ్య డెల్టా పరిధిలో ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల దిగువన ముక్తేశ్వరం పంట కాలువపై నిర్మాణంలో ఉన్న సైఫన్

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో ఖరీఫ్‌కు ప్రధాన అవరోధం 'ముంపు'. సాగు ఆలస్యం అయి భారీ వర్షాలు, తుపాన్ల సమయంలో ఖరీఫ్ దిగుబడికి సిద్ధంగా కావడం వల్ల చేలు ముంపుబారిన పడి రైతులు కోట్ల రూపాయలు నష్టపోవడం పరిపాటిగా మారింది. దీనిని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డెల్టాలో ముందస్తు సాగును ప్రోత్సహించింది. దీనిలో భాగంగా జూన్ ఒకటి, రెండు తేదీలలో నీరు విడుదల చేయడం మొదలు పెట్టింది. ఈసారి కూటమి ప్రభుత్వం కూడా ముందస్తు సాగుకు నీరు విడుదల చేస్తామని చెప్పి కొంత మొత్తంలో నీరు విడుదల చేసింది. దానికి కూడా పలుచోట్ల హెడ్ స్లూయిజ్‌ల సమీపంలోనే నిలిపివేయడం గమనార్హం.

కోటి ఆశల ఖరీఫ్‌కు ఆదిలోనే అవరోధం ఏర్పడింది. ముందస్తు సాగుకు వీలుగా జూన్ ఒకటి, రెండు తేదీల్లో పశ్చిమ, తూర్పు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువలకు నీరు విడుదల చేశారు. కాని ఈ మూడు డెల్టాలకు కలిపి కేవలం 800 క్యూసెక్కులు మాత్రమే నీరు వదులుతున్నారు. దీంతో పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కులు, తూర్పు డెల్టాకు 200 క్యూసెక్కులు. మధ్య డెల్టాకు 100 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు. దీనిలో మధ్య డెల్టాకు వదులుతున్న నీరు సమీపంలోని లొల్ల లాకుల వద్దనే నిలిపివేశారు. ఇక్కడ నిలిపివేయడం ద్వారా పి.గన్నవరం, ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్, అమలాపురం కాలువలకు నీరు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఇక తూర్పు డెల్టాకు 200 క్యూసెక్కుల వదలడం వల్ల కూడా ఎటువంటి ప్రయోజనం లేదు. దీని మీద కాకినాడ, మండపేట, కోరంగి, కోటిపల్లి, సామర్లకోట, పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీరందాల్సి ఉంది. అలాగే పశ్చిమ డెల్టాలో ఏలూరు, నర్సాపురం బ్యాంకు కెనాల్ ద్వారా సాగునీరందాల్సి ఉంది.

**ముందస్తుతో పలు విధాలుగా మేలు**

ప్రకృతి వైపరీత్యాల నుంచి ఖరీఫ్ పంటను గట్టెక్కించడం, రబీ సాగు నీటి ఎద్దడి బారిన పడకుండా చూడడం, మూడవ పంటగా అపరాలు సాగు చేయించడం ద్వా రా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చేయడం వంటి ఉన్నత లక్ష్యాలకు అనుగుణంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్‌లో ముందస్తు సాగును ప్రోత్సహించింది. కాని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఖరీఫ్, రబీ నీటి విడుదలపై నిర్లక్ష్యం కమ్ముకుంటోంది. పంట కాలువలపై మొదలు పెట్టిన పనులు ఇంకా ప్రాథమిక దశలో ఉండడంతో నీటి విడుదల ఆలస్యమై ఆ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడనుంది. కాకినాడ జిల్లా పరిధిలో తూర్పు డెల్టాకు వచ్చి మొత్తం 3,40,548.78 ఎకరాల నికర ఆయకట్టు ఉండగా, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో తూర్పు, మధ్య డెల్టాలు కలిపి 2,46,155.26 ఎకరాలు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో తూర్పు, పశ్చిమ డెల్టాలు కలిపి మొత్తం 66,692.47 ఎకరాలు ఉంది. ఇక్కడ సాగు ఆలస్యమైతే వరి దిగుబడి వచ్చే సమయానికి వర్షాలు, తుపాన్ల బారిన పడే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తూర్పు డెల్టా పరిధిలో మడికి నుంచి దుళ్ల పంటకాలువకు చేరని సాగునీరు

**డెల్టా ఆయకట్టు ఇలా (ఎకరాల్లో)**

| జిల్లా | రిజిస్టర్ ఆయకట్టు | నికర ఆయకట్టు |
|---|---|---|
| కాకినాడ | 2,75,765.62 | 2,60,192.27 |
| కాకినాడ జిల్లా (పిఠాపురం బ్రాంచ్ కెనాల్) | – | 80,356.10 |

### క్లోజర్ పనులు ఇప్పుడు మొదలు పెట్టారు

డెల్టా పంట కాలువలకు ఏప్రిల్ 27వ తేదీ నుంచి నీళ్లు బంద్ చేశారు. అయితే చాలాచోట్ల మే 20 తరువాత క్లోజర్ పనులు మొదలయ్యాయి. కొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే పనులు మొదలు పెట్టడం గమనార్హం. ఆత్రేయపురం మండలం లొల్ల లాకు దిగువన మూడు కాలువల మీద మొదలు పెట్టిన సైఫన్ నిర్మాణాల పనులు నత్తను తలపిస్తున్నాయి. అమలాపురంలో బెండా కెనాల్ మీద ఈదరపల్లి, నడిపూడి వద్ద వంతెనల నిర్మాణాలు సైతం అనుకున్నంత వేగంగా సాగడం లేదు. ఇవి కాకుండా పి.గన్నవరం, ముక్తేశ్వరం, అమలాపురం, మండపేట, కాకినాడ కాలువల మీద ఇప్పుడిప్పుడే పూడిక తీత పనులు చేపట్టడం గమనార్హం. ఈ పనులు ఈ నెల పదవ తేదీ నాటికి పూర్తయ్యే అవకాశముందని సాగునీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన కోనసీమ జిల్లా సమావేశంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సైతం ఈ నెల పదవ తేదీకి పనులు పూర్తి చేయాలని కోరారు. అంటే ఈ నెల పది వరకు కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరందే అవకాశం లేదని తేలిపోయింది. అటువంటప్పుడు జూన్1వ తేదీన సాగు నీరు విడుదల చేయడం ఎందుకని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. జూన్ పదో తేదీన నీరు విడుదల చేసినా పంట కాలువల వ్యవస్థ అధ్వానంగా ఉండడం వల్ల ఈ నెల 20వ తేదీ వరకు ఆయకట్టుకు చేరే పరిస్థితి లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.

## క్లుప్తంగా

### అక్రమంగా గోవుల తరలింపు

- 48 మూగజీవాల స్వాధీనం
- పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు
- వాహనం సీజ్



కొవ్వూరు వద్ద ఆవులను తరలిస్తున్న ఐషర్

**తాళ్లపూడి:** ఐషర్ లారీలో అక్రమంగా తరలిస్తున్న ఆవులు, దూడలు, ఎద్దులను కొవ్వూరు సీఐ పి.విశ్వం స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని గ్రామన్ బ్రిడ్జి వద్ద రోడ్డు బొబ్బిలి నుంచి తుని మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి అందులని 16 ఆవులు, 18 దూడలు, నాలుగు ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అనుమతి లేకుండా గోవులను తరలిస్తే చర్యలు తప్పవని విశ్వం తెలిపారు. దీనిపై తాండ్ర నరేష్, పాసాదులు దుర్గాప్రసాద్‌లపై కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ తెలిపారు.

### వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ధవళేశ్వరం:** స్థానిక జాతీయ రహదారిపై మంతెన సత్యనారాయణరాజు ఆశ్రయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై సుమారు 40 ఏళ్ల వయసున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుని ఆచూకీ తెలిసినవారు 94407 96586, 94919 99336 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ టి.గణేష్ కోరారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 14,000 – 14,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 – 10,000 |
| కురిడీ కొబ్బరి (పాతవి) | |
| గండేరా (వెయ్యి) | 22,500 |
| గటగట (వెయ్యి) | 20,000 |
| కురిడీ కొబ్బరి (కొత్తవి) | |
| గండేరా (వెయ్యి) | 21,500 |
| గటగట (వెయ్యి) | 19,500 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 14,500 – 15,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 14,500 – 15,000 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

# నేత్రపర్వం.. బాలాజీ పరిణయం..

- దివ్య కల్యాణాన్ని చూసి తరించిన భక్తజనం
- కనువిందు చేసిన రాయబారోత్సవం
- దేవేరులతో దర్శనమిచ్చిన స్వామివారు



స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



ఎదుర్కోలు సన్నాహంలో భాగంగా రాయబారోత్సవం



గరుడ వాహనంపై సాగుతున్న తిరువీధి ఉత్సవం



భక్తులను ఆకట్టుకున్న కోలాటం

**మామిడికుదురు:** పవిత్ర వైనతేయ గోదావరి నదీతీరం అప్పనపల్లి క్షేత్రంలో బాలునిగా కొలువుదీరిన బాల బాలాజీస్వామి దివ్య తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తంలో రాత్రి 9.15 గంటలకు శ్రీదేవి, భూదేవిలను స్వామివారు పరిణయమాడారు. కల్యాణానికి ముందుగా స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తులకు వివరిస్తూ నిర్వహించిన రాయబారోత్సవం (ఎదుర్కోలు సన్నాహం) భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గుణ గణాల్లో స్వామి వారికి అమ్మవార్లు సరిజోడి అంటూ సాగిన ఈ ఉత్సవాన్ని చూసిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంలో దేవేరులతో కొలువు తీరిన స్వామి వారు భక్తకోటికి సర్వమంగళ రూపంలో దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఆలయ ఉప ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో భక్తుల కోసం ఘనంగా ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించి తన్మయులయ్యారు.

**కన్నుల పండువగా గ్రామోత్సవం**

వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారిని, దేవేరులను పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది గ్రామోత్సవంలో పాల్గొని పరమానందం పొందారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని పలు రకాల బెంగుళూరు పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

**ప్రత్యేక ఆకర్షణగా కోలాటం**

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన హరే శ్రీనివాస్ కోలాటం ఆహూతులను ఆనంద పరవశుల్ని చేసింది. అలాగే కేరళ వాయిద్యాలు భక్తుల్ని తన్మయత్వంలో ముంచెత్తాయి. అప్పనపల్లికి చెందిన వాణి మహిళా సత్సంగ మిత్ర బృందం సభ్యులు ఆలపించిన శ్రీలలితా విష్ణు సహస్రనామ పారాయణం, మామిడికుదురుకు చెందిన యింటి శ్రీరామ్‌కుమార్, సుజాత ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను మంత్ర ముగ్ధుల్ని చేశాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఆర్డీవో మాధవి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ రుద్రరాజు భీమరాజు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

> **సంతానం కోసం పూజలు**
>
> సంతానం లేక ఇబ్బంది పడుతున్న మహిళలకు శుక్రవారం ఉదయం ధ్వజారోహణం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఈ ప్రసాదాన్ని తినడం ద్వారా సంతాన యోగం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- చెట్టుకు ఢీకొని నుజ్జయిన కారు
- పోతవరంలో విషాద ఛాయలు



మనోజ్ (ఫైల్)



ఆద్య (ఫైల్)



చెట్టును ఢీకొన్న కారు



ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ హోం మంత్రి వనిత

**నల్లజర్ల:** మండలంలోని పోతవరం–యర్నగూడెం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు సోదరుడు రామకృష్ణ తన భార్య రత్నకుమారి, కుమారుడు మనోజ్ (24), మనుమరాలు ఆద్య (2) నిడదవోలులోని కలవచర్ల గ్రామానికి ఓ వివాహానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు. పోతవరం నుంచి బయలుదేరి కిలోమీటరు దూరం వెళ్లేసరికే అతివేగంతో చెట్టును ఢీకొని కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో మనోజ్ అక్కడికక్కడే మృతి చెందగా రామకృష్ణ, రత్నకుమారి, ఆద్య తీవ్ర గాయాలపాలయ్యారు. పోతవరంలో జరుగుతున్న జాతర హడావిడిలో ఉన్న గ్రామస్తులు ఈ ప్రమాద వార్త తెలియగానే హుటాహుటిన ఘటనాస్థలానికి వెళ్లి క్షతగాత్రులను ఏలూరు ఆశ్రమ్ ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణ మనవరాలు (కుమార్తె అంకితకు కుమార్తె) ఆద్య చికిత్స పొందుతూ మృతి చెందగా మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. పోతవరంలో జరుగుతున్న జాతర చూసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన మనోజ్ ఇలా మృతి చెందడంతో పోతవరంలో విషాదఛాయలు అలముకున్నాయి. క్షతగాత్రలను మాజీ హోం మంత్రి తానేటి వనిత, మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, మాజీ జెడ్పీటీసీ బంక అప్పారావు పరామర్శించారు. అనంతరం పోతవరం వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి బంధువులను పరామర్శించారు. కాగా ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదు.

**తమ్ముడి పిల్లలే తన పిల్లలుగా..**

పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావుకు పిల్లలు లేకపోవడంతో తన సోదరుడు రామకృష్ణ పిల్లలనే తన పిల్లలుగా అల్లారుముద్దుగా పెంచారు. అవసాన దశలో తమ అన్నదమ్ములిద్దరికి ఆసరాగా ఉంటాడుకున్న మనోజ్ జీవితం ఇలా ముగియడంతో ఆ దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన మనోజ్ కారు కావాలంటే కొన్నామని, ఏ లోటూ రాకుండా చూసుకున్నామని వారు అతనితో జ్ఞాపకాలను గుర్తుచేసుకుని రోదిస్తున్నారు.

# ఉసురు తీసిన అతివేగం

- స్నేహితుడి వివాహానికి వెళ్తూ ఒకరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన అంజిబాబు



అన్నవరప్పాడు వద్ద జాతీయ రహదారిపై మృతి చెందిన కత్తుల మహేష్



డివైడర్‌పై పడిన మోటార్ సైకిల్

**పెరవలి:** స్నేహితుడి పెళ్లికి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి పడిపోయిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని అన్నవరప్పాడు వద్ద జరిగిన ఈ సంఘటన వివరాలను ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన మేరకు.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామానికి చెందిన కత్తుల మహేష్ (19), శీలం అంజిబాబు రైడర్ మోటార్‌సైకిల్‌పై వేగంగా వస్తుండగా సడన్ బ్రేక్ వేయటంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడి సుమారు 60 మీటర్ల దూరం రోడ్డుపైనే ఈడ్చుకుపోయి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ సమయంలో మోటార్‌సైకిల్ నడుపుతున్న కత్తుల మహేష్ రోడ్డు డివైడర్‌పై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడని స్థానికులు తెలిపారు. స్థానికులు ప్రమాదం జరిగిన వెంటనే పరుగున వచ్చి ఇద్దరినీ లేపగా మహేష్ ఎటువంటి చలనం లేకపోవటంతో శీలం అంజిబాబును లేపి రోడ్డు పక్కన కూర్చోపెట్టారు. అతడికి తీవ్రగాయాలయ్యాయని, కుడికాలు విరిగిపోయిందని స్థానికులు తెలిపారు. ఇంతలో జాతీయ రహదారుల అంబులెన్స్ వచ్చి మహేష్‌కు సపర్యలు చేయగా శరీరంలో కదలిక రావడంతో వెంటనే ఆక్సిజన్ పెట్టి తణుకు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యం అందిస్తుండగా మహేష్ మృతిచెందినట్టు తెలిపారు. మహేష్ తండ్రి కత్తుల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

# వైభవంగా వేణుగోపాలుని కల్యాణం



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ చక్రధరరావు

**కొత్తపేట:** ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో కొలువైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేషార్చనలు జరిపారు. సాయంత్రం కల్యాణాన్ని ప్రారంభించారు. ప్రదానం నుంచి తలంబ్రాలు వరకూ ప్రతి క్రతువునూ వేదపండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే వ్యాఖ్యాన పండితులు ప్రతి ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టు వివరించారు. స్వామి, అమ్మవార్లకు దేవస్థానం తరఫున డీసీ, ఈఓ చక్రధరరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కల్యాణ మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు ఈఓ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

**అభివృద్ధి పనుల పరిశీలన**

**కొత్తపేట:** వాడపల్లి క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ క్షేత్రానికి పెరుగుతున్న భక్తుల తాకిడికి అనుగుణంగా సౌకర్యాలు, రహదారుల ఆధునీకరణ, వాహనాల పార్కింగ్ స్థలం అభివృద్ధి, ఏడు వారాల ప్రదక్షిణకు అనుకూలంగా మాడ వీధుల విస్తరణ వంటి పనులు చేపట్టారు. ఆయా పనులపై ఆర్డీఓ శ్రీకర్, దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావుతో సమీక్షించారు. దానిలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల స్థూపాన్ని పరిశీలించారు.

**అన్నప్రసాద భవనానికి విరాళాలు**

వాడపల్లి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా భీమవరానికి చెందిన సీవీ చంటి, శాంతి దంపతులు రూ.1,15,000 విరాళంగా సమర్పించారు. వారు శుక్రవారం స్వామివారిని దర్శించుకున్నారు. దాతలకు ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందచేశారు.



వేణుగోపాలుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**కాకినాడ రూరల్:** కాకినాడ నుంచి సామర్లకోట వెళ్లే మార్గంలో గంగనాపల్లి గ్రామ పరిధిలో కోటిపల్లి రైల్వే లైన్ దాటిన తరువాత కాల్వలో గుర్తు పట్టలేని స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 మధ్య ఉండవచ్చని, గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. సుమారు 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాల్వ నీటిలో మునిగిపోయి ఉంటాడని, మృతదేహం ఉబ్బిపోయి చర్మం ఊడిపోయి ఉన్నట్టు ఎస్సై వీరబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# హోరాహోరీగా ఎడ్లపోటీలు

పోటీలో పరుగులు పెడుతున్న ఎడ్లు →



**ఏలేశ్వరం:** మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ జాతరలో భాగంగా శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్లబళ్ల పరుగుపందేలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 50 జట్లు పాల్గొనగా సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు జిల్లా వ్యాప్తంగా భారీగా ప్రజలు వచ్చారు. సీనియర్ విభాగంలో తూర్పు గోదావరి జిల్లా గుమ్ములేరుకు చెందిన కోరా వీరవెంకట సత్యవేణి ఎడ్లు ప్రథమ స్థానం, కాకినాడ జిల్లా కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠకు చెందిన ఎడ్లు ద్వితీయ స్థానం, కాపవరానికి చెందిన కుంచం మనోజ్‌కు చెందిన ఎడ్లు తృతీయస్థానంలో విజయం సాధించాయి. జూనియర్ విభాగంలో అనకాపల్లి జిల్లా చౌడువాడకు చెందిన గడ్డం అప్పారావు ఎడ్లు ప్రథమం, అదే జిల్లా దూళ్లకు చెందిన బడామాను శ్రీను ఎడ్లకు ద్వితీయ స్థానం, తూర్పు గోదావరి జిల్లా కొప్పవరానికి చెందిన బండారు శ్రీనుకు చెందిన ఎడ్లు తృతీయస్థానం సాధించాయి. విజేతలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్ల పందాల ద్వారా స్నేహపూర్వక వాతావరణం ఉంటుందన్నారు.

# రత్నగిరికి పోటెత్తిన భక్తజనం

- ఆలయం వద్ద నవ దంపతుల సందడి
- ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు



సత్యదేవుని వ్రతాలు చేసుకుంటున్న భక్తులు

**అన్నవరం:** జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి కిక్కిరిసింది. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో నిండిపోయాయి. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై జరిగిన వివాహాలతో నవ దంపతులు, వారి బంధుమిత్రులతో పాటు రాష్ట్రంలోని పలు చోట్ల కూడా అవే ముహూర్తాలలో వివాహాలు చేసుకున్న భక్తులు రత్నగిరికి వచ్చి వ్రతాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. శుక్రవారం అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షలు ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన, తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు తులసి దళాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు సుధీర్, పరిచారకులు పవన్ తదితరులు నిర్వహించారు.

**నేడు తిరుచ్చి వాహనంపై సత్యదేవుని ఊరేగింపు**

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను శనివారం తిరుచ్చి వాహనంపై ఊరేగించనున్నారు. ఉదయం పది గంటలకు ఈ ఊరేగింపు ప్రారంభం కానుంది.

# సిద్ధ సమాధికి కామేశ మహర్షి

**శ్రీకామాక్షీ పీఠంలో ముగిసిన అంత్యక్రియలు**



అమలాపురం కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షికి పీఠంలోనే సిద్ధి సమాధి క్రతువును నిర్వహిస్తున్న దృశ్యం

**అమలాపురం టౌన్:** శివైక్యం పొందిన స్థానిక శ్రీ కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి సిద్ధ సమాధి క్రతువు అదే పీఠంలో శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. సిద్ధ పురుషులు, స్వామీజీలు, పీఠాధిపతులకు ఏ రకమైన సిద్ధి సమాధి నిర్వహిస్తారో అదే సంప్రదాయంలో కామేశ మహర్షికి నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి విఖనస రాఖీ ప్రేమ్ ఆధ్వర్యంలో ఈ క్రతువు నిర్వహించారు. పీఠం బ్రహ్మ బ్రహ్మశ్రీ గోవిందవఝల నాగబాబు బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవాచనం, పరిషత్, కృచ్ఛ్రాత్రయం, పంచ గవ్య ప్రాసన వంటి పూజాదికాలు చేశారు. కామేశ మహర్షి పార్థివ శరీరానికి పంచ వాకములతో 11 రకాల అభిషేకాలు, విరజాహోమాలు, పుష్పార్చన తర్వాత సమాధి స్థల శుద్ధి, భూత బలి నిర్వహించారు. వేద పండితులు పంచ కాటక, పంచ ఉప నిషత్తులు తదితర పూజాదికాలతో సిద్ధి సమాధి నిర్మించి చివరిగా మంగళ హారతితో ఈ క్రతువు ముగిసింది. తమను కన్న వారి కంటే మిన్నగా కంటికి రెప్పలా పెంచుతున్న పీఠంలోని ప్రేమ మందిరం అనాథ పిల్లలు కన్నీరు మున్నీరయ్యారు. చివరగా తమ గురువులు కామేశ మహర్షి పార్థివ శరీరానికి నమస్కరించి కన్నీటి వీడ్కో లు చెప్పారు. ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు, కామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ప్రేమ మందిరం పూర్వ ఆశ్రమవాసులైన అనాథలు, పట్టణ ప్రముఖులు తమ గురు వు కామేశ మహర్షికి నివాళులర్పించారు. తమ గురువు సిద్ధ సమాధి ప్రక్రియలో పాల్గొనేందుకు అనేక మంది భక్తులు తరలి వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు.

# రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

– కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్

**కరప:** కాలానుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సైంటిస్ట్ డాక్టర్ కేఎల్ ప్రసాద్ అన్నారు. పెనుగుదురు రైతు సేవాకేంద్రంలో శుక్రవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, రైతులు పొలంలో మట్టి పరీక్షలు చేయించాలన్నారు. దీనివల్ల సాగులో పెట్టుబడులు తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం వల్ల నేల సారవంతమవుతుందన్నారు. కాకినాడ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మాధవి మాట్లాడుతూ, పంట కాలువలకు సాగు నీరు విడుదలైందని, రైతులు ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలన్నారు. అక్టోబరు నెలాఖరుకు పంటచేతికొస్తే, నవంబర్‌లో తుపాన్ల నుంచి గట్టెక్కవచ్చన్నారు. పెట్టుబడులు తగ్గించుకునేందుకు బెంగాల్ ఊడ్పు, వెదజల్లు పద్ధతులు అనుసరించాలన్నారు. ఖరీఫ్‌లో మేలైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని, విత్తన శుద్ధి చేయాలన్నారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ విధానంలో డ్రోన్ టెక్నాలజీని రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. 80 శాతం రాయితీతో అందిస్తున్న డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలకరి పంటకు స్వర్ణ రకంతో పాటు, ఎంటీయూ–1318 రకాన్ని కూడా సాగు చేసి, అధిక వర్షాలు, ముంపు నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. పిఠాపురం ఉద్యానవన శాఖాధికారి శైలజ మాట్లాడుతూ, పొలాల గట్లపై, ఇంటి మిద్దెలపై సాగు ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.రవీంద్ర, ఏఈఓ బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.